సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

అనువాదకునికి అభినందనలు



అధ్యాపకుడు విజయప్రతాప్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం : కేంద్ర మత్స్య, పశుగణన, పాల ఉత్పత్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ మత్స్య పరిశ్రమ రంగంలో మార్కెట్ మెలకువలు అనే అంశంపై డిసిమినేషన్ వర్క్‌షాప్‌లో కృష్ణా కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకుడు జి.విజయప్రతాప్ చక్కగా అనువాదం చేసి, అందరి మన్ననలు పొందారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు శుక్రవారం నను తన చాంబర్‌లో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, ఎన్ఎస్ఎస్ అధికారి పి.ఉమా మహేశ్వరరావు, శామ్యూల్ డేవిడ్ రాజ్, బి.లక్ష్మి పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియపై పోలీసులకు అవగాహన



ఏఆర్ పోలీసులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆరిలోవ: రానున్న సాధారణ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధానాలపై ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీసులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లోని కైలాసగిరి పోలీస్ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్నికల సెల్ సీఐ కె.కుమారస్వామి విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసే వరకు పోలీసుల పాత్ర, విధులు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, అక్రమాలకు అడ్డుకట్ట వేయడం, శాంతి భద్రతల పరిరక్షణ, తదితర అంశాల గురించి వివరించారు. ఎన్నికలు ప్రశాంతంగా సాగడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఎన్నికల విధి విధానాల గురించి అందరూ తెలుసుకోవాలని సూచించారు.

ఆలోచింపజేసిన 'వ్యవసాయం'



వ్యవసాయం నాటికలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం : స్థానిక కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం నెల్లూరుకు చెందిన ప్రియదర్శిని నాటిక సమితి ఆధ్వర్యంలో వ్యవసాయం నాటికను ప్రదర్శించారు. జీవీకే మూర్తి కలం నుంచి జాలువారిన కథకు సుధా దర్శకత్వంలో ప్రదర్శించిన వ్యవసాయం సాంఘిక నాటిక ప్రేక్షకుల హృదయాలను కదిలించింది. వ్యవసాయ క్షేత్రంలో రైతు కలుపు మొక్కలను తొలగించి పది మంది ఆకలి తీర్చే పంటను పండిస్తాడు. అలాగే ప్రతి మనిషి తన మనో క్షేత్రంలో ఉండే నేను, నాది అన్న స్వార్థంతో, దోపిడీ, అవినీతి, అధర్మం అనే కలుపు మొక్కలను తొలగించి, మనం మనది, అనే పచ్చటి పంటను పండించే ఇతివృత్తంతో ఈ నాటిక సాగింది. కథకు తగ్గట్టుగా నటీనటులు తమ నటనతో అందర్నీ మెప్పించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శుక్రవారం నగరంలోని సీతంపేటకి చెందిన కరణం వెంకటేశ్వరరావు రూ1,00,116 విరాళాన్ని అందజేశారు. సంబంధిత చెక్కును సింహగిరిపై దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తికి అందజేశారు. దేవస్థానం తరుపున దాతకు స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు.

తంచన్‌గా పింఛన్

- తెల్లవారుజాము నుంచి పెన్షన్ల పంపిణీ
- తూర్పులో 90 శాతం పూర్తి

ఆరిలోవ/ఎంవీపీ కాలనీ: తూర్పు నియోజకవర్గంలో మార్చి నెలకు సంబంధించి వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ శుక్రవారం ఉత్సాహంగా సాగింది. నియోజకవర్గంలో అన్ని వార్డుల్లో తెల్లవారే సరికి వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను డబ్బులు అందజేశారు. జీవీఎంసీ జోన్-2 పరిధి 9వ వార్డు నుంచి 13వ వార్డు వరకు, జోన్-3 పరిధిలో 15వ వార్డు నుంచి 23వ వార్డు వరకు, 28వ వార్డులో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల పంపిణీ చేశారు.

- ఎంవీపీ కాలనీ 17వ వార్డులో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం విస్తృతంగా జరిగింది. వలంటీర్ మద్ది ఇందుతో పాటు పలువురు వార్డులోని వృద్ధులకు వైఎస్సార్ పెన్షన్‌ను అందజేశారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి వార్డులోని వృద్ధులు, వితంతువుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ అందజేశారు. శుక్రవారం సాయంత్రానికి 90 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు వలంటీర్లు వెల్లడించారు. 19, 18 వార్డుల్లో కూడా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చురుగ్గా జరిగింది. ఈ కార్యక్రమంలో 17వ వార్డు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మద్ది లక్ష్మణరెడ్డి, గృహసారథి మరడా కామేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



13వ వార్డులో కాకి కామేశ్వరరావుకు రూ.5 వేలు పింఛన్ అందిస్తున్న వలంటీరు రోజా



7వ వార్డులో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు



20వ వార్డులో లబ్ధిదారుకు పింఛన్ అందిస్తున్న వలంటీరు, నాయకులు

నైపుణ్యాలతో మెరుగైన అవకాశాలు సాధ్యం



మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని, అప్పుడు మెరుగైన ఉపాధి అవకాశాలు సాధ్యమవుతాయని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో నిర్వహించిన యాంత్రిక 2కే24 సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మార్కులు అవసరమే కానీ.. అవే ప్రధానం కాదన్నారు. నైపుణ్యాలు, ప్రత్యేక సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఏఐ, బ్లాక్ చైన్, ఎంఐ, ఐవోటీ, ఇండస్ట్రీ 4.0 వంటి సాంకేతికతలను అన్ని శాస్త్రాలతో మిళితం చేస్తూ ఉపయుక్తంగా నిలుపుకోవాలని సూచించారు. శాస్త్ర అంశాలను నేర్చుకోవడంతో పాటు వాటిని నిత్య జీవితంలో అన్వయించడం ఎంతో అవసరమన్నారు. నూతనంగా అభివృద్ధి చెందుతున్న శాస్త్రాలను, సాంకేతికతను యువతకు అలవాటు చేస్తూ వారిని భవిష్యత్తుకు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూచించారన్నారు. ఎడ్‌ఎక్స్‌తో ఏపీ ప్రభుత్వం చేసుకున్న ఎంవోయూలు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ కళాశాలలో వసతులను సద్వినియోగం చేసుకుంటూ పూర్తి సామర్థ్యాలతో పని చేయాలన్నారు. మహిళా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కె.భట్టి మాట్లాడుతూ 5 వేల పుస్తకాలతో గ్రంథాలయం, డిజిటల్ స్మార్ట్ బోర్డులు, అధునాతన వసతులతో ప్రయోగశాలలు, 92 శాతం మంది విద్యార్థినులకు ఉద్యోగాలు లభించాయని తమ కళాశాల ప్రత్యేకతలను వివరించారు. తమ విద్యార్థులు ఐదుగురికి జాతీయ స్థాయిలో స్కాలర్‌షిప్‌లు లభించాయన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు పి.ప్రజ్ఞ, జి.శిరీష, ఎస్.అరుణ, స్టూడెంట్ కన్వీనర్ వెన్నెల తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.

విమ్స్‌లో న్యూరో శిబిరానికి విశేష స్పందన



విమ్స్‌లో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న న్యూరో సర్జన్ వైద్యులు, డైరెక్టర్ డాక్టర్ రాంబాబు



రోగులు, వారి బంధువులతో రద్దీగా శిబిరం

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో శుక్రవారం నిర్వహించిన న్యూరో ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ముందుగా ఈ శిబిరాన్ని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ప్రారంభించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన ఈ శిబిరంలో 205 మందికి న్యూరో విభాగం వైద్యులు డాక్టర్ మౌనిక, డాక్టర్ ప్రదీప్, సిబ్బంది పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ విమ్స్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో 29 మందికి సీటీ స్కాన్, 15 మందికి రక్త పరీక్షలు చేశామన్నారు. బ్రెయిన్ స్ట్రోక్, తలనొప్పి, వెన్నుముఖ సమస్యలు నిర్ధారించే పరీక్షలు చేసినట్లు ఆయన తెలిపారు.

3, 4 తేదీల్లో 'ఐడియల్ గాంధర్వ'



కార్యక్రమ వివరాలు వివరిస్తున్న శరత్‌చంద్ర తదితరులు

ఏయూ క్యాంపస్: అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా విశాఖ నగరంలో ఈ నెల 3, 4 తేదీల్లో ఐడియల్ గాంధర్వ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఘంటసాల స్వర పరిశోధకుడు టి.శరత్‌చంద్ర తెలిపారు. శుక్రవారం లాసన్స్‌బే కాలనీలోని అసంగానంద ఆశ్రమంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వర్ధమాన గాయకులు, మట్టిలో మాణిక్యాలను ఎంపిక చేసి ప్రముఖ గాయకులతో శిక్షణ ఇచ్చి భవిష్యత్ తరాలకు ఘంటశాల పాటలు, స్వరపరిచిన గీతాలు, పద్యాలు అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో గాయకుల ఎంపిక కార్యక్రమం పూర్తి చేశామన్నారు. ఈ మేరకు కార్యక్రమ లోగో, పోస్టర్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గాయకులు దాము గేదెల, ఎం.ఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ ప్రగతిపై పూర్వ విద్యార్థుల హర్షం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వకళా పరిషత్‌ని దేశానికి గర్వకారణంగా తీర్చిదిద్దారని ఏయూ పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఏయూలో ఆరు దశాబ్దాల క్రితం చదువుకున్న విద్యార్థులు పలువురు శుక్రవారం ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల కాలంలో ఏయూను అభివృద్ధి చేసిన విధానంపై వారు సంతోషం వ్యక్తం చేశారు. ఏయూలో మైదానాల అభివృద్ధి, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయడం, ఆక్రమణలకు గురైన ఏయూ భూముల స్వాధీనం చేసుకోవడంపై వీసీని వారు అభినందించారు.

శతాబ్ది ఉత్సవాలకు చేరువవుతున్న ఏయూ అభివృద్ధిలో తామంతా భాగమవుతామని, వర్సిటీకి అవసరమైన ఎటువంటి సహాయం అయినా అందిస్తామని చెప్పారు. వారి ప్రతిపాదనకు వీసీ స్పందిస్తూ వర్సిటీకి ఆర్థికపరమైన సహాయం రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందిస్తోందన్నారు. పూర్వ విద్యార్థుల నిపుణత, జ్ఞానం, అనుభవం నేటి తరానికి అందించాలన్నారు.

యువతకు ఉత్తమ వ్యక్తిత్వం అవసరం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి, డాక్టర్ లక్ష్మీపార్వతి

ఏయూ క్యాంపస్: ఉత్తమ వ్యక్తిత్వంతో యువతరం ఎదగాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో ఏయూ టీడీఆర్ హబ్, తెలుగుమల్లి(ఆస్ట్రేలియా) సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన ప్రవాస సాహిత్యం(తెలుగు, హిందీ, ఇంగ్లిష్) అంతర్జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భాషల పరిరక్షణకు, వికాసానికి సదస్సులు ఉపకరిస్తాయన్నారు. ప్రతి విద్యార్థికి తల్లిదండ్రులే నిజమైన రోల్‌మోడల్స్‌గా నిలుస్తారన్నారు. విదేశాలలో స్థిరపడిన భారతీయులు, తెలుగు వారు రాష్ట్రానికి, భాషకు వారధులుగా నిలుస్తున్నారన్నారు. తెలుగు, సంస్కృత అకాడమీల చైర్‌పర్సన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ భాషను పరిరక్షించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. తెలుగు భాష అభివృద్ధికి ఏయూ అందిస్తున్న ప్రోత్సాహం అపారమన్నారు. విదేశాలలో తెలుగువారి సంఖ్య పెరుగుతోందన్నారు. అమెరికాలోని వంగూరి ఫౌండేషన్ నిర్వాహకులు వంగూరి చిట్టెన్ రాజు మాట్లాడుతూ జీతం కోసం ఆంగ్లం, జీవితం కోసం తెలుగు అవసరమన్నారు. ప్రాంతీయ భాషల్లో కోడింగ్‌కి ప్రాముఖ్యత పెరుగుతుందన్నారు. సదస్సులో భాగంగా కె.మల్లికేశ్వరరావు రచించిన తూర్పు తీరంలో తెలుగు రేఖలు పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. అనంతరం డిలిట్ అందుకున్న డాక్టర్ లక్ష్మీపార్వతిని ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. అలాగే సదస్సులో పాల్గొన్న అతిథులను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దూరదర్శన్ విశ్రాంత ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామర్ ఓలేటి పార్వతీశం, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, ఆచార్య కె.మలయవాసిని, సదస్సు కన్వీనర్ ఆచార్య ఎ.సీతారత్నం, సహ కన్వీనర్లు ఆచార్య జె.విజయభారతి, కె.రాజ మాణిక్యం, పెద్ద సంఖ్యలో ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

16వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, తదితరులు

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. స్థానిక కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావుతో కలిసి వార్డులోని కేఆర్ఎం కాలనీ నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ వరకూ తారు రోడ్డు పనులకు ఎంపీ శ్రీకారం చుట్టారు. జీవీఎంసీ సాధారణ నిధులు రూ.36.20 లక్షలతో ఈ పనులు చేపడుతున్నామని ఎంపీ తెలిపారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఏఈ శ్రీనివాసరావు, పార్టీ నాయకుడు శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రైడే తప్పనిసరిగా పాటించాలి



నిల్వ నీటితో దోమల ఉత్పత్తిపై అవగాహన కల్పిస్తున్న హెల్త్ అసిస్టెంట్ వేణు

మద్దిలపాలెం : దోమల వృద్ధిని అరికట్టడానికి ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను తొలగించాలని జిల్లా మలేరియా విభాగం సూపర్‌వైజర్ కుమార్, హెల్త్ అసిస్టెంట్ కె.వేణుగోపాల్ సూచించారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా శుక్రవారం లక్ష్మీనగర్, శివాజీపాలెం పరిసరాలలో నీటి నిల్వల తొలగింపు కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బందితో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో నీటి నిల్వల ద్వారా దోమల ఉత్పత్తి చెందే విధానాన్ని వివరించారు. దీనికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రతి శుక్రవారం విధిగా నీటి నిల్వల తొలగింపు ప్రక్రియ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఏఎన్ఎం, జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు జగన్ సర్కారు విశేష కృషి

ఎంవీపీ కాలనీ: సమత కళాశాల 32వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని ఆళ్వార్‌దాస్ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఉన్నత విద్యావిధానం అమలులో దేశంలో ఆంధ్రప్రదేశ్ 3వ స్థానంలో ఉందన్నారు. ఉన్నత విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ఏపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. దేశంలో తొలిసారి నాలుగేళ్ల డిగ్రీని రాష్ట్రంలో ప్రవేశపెట్టిందన్నారు. ఈ వేడుకల్లో సినీ నటుడు, సుందరం మాస్టర్ ఫేమ్ వైవా హర్ష ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థులతో పాటు సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్, ఆళ్వార్‌దాస్ విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ సుంకరి రవీంద్ర, సమతా కళాశాల డీన్ ఆచార్య విజయరవీంద్ర, దీపికదాస్, సూర్యతేజ, దివ్యాదాస్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వీసీ ఆచార్య ప్రసాదరెడ్డిని సత్కరించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఆరిలోవలో వృద్ధులతో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు

ఆరిలోవ: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు కోరారు. జీవీఎంసీ 13వ వార్డు ఆరిలోవ కాలనీలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రీయ వయోశ్రీ యోజన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఈ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు వినికిడి యంత్రాలు, కళ్లద్దాలు, వీల్ చైర్లు, నడుము బెల్ట్‌లు, మోకాలు బెల్ట్‌లు, ఊత కర్రలు అందజేశారు. ఈ సందర్భంగా జీవీఎల్ మాట్లాడుతూ వయోశ్రీ యోజన పథకం 60 ఏళ్ల దాటిన వయో వృద్ధులకు ఆసరాగా నిలుస్తుందన్నారు. ఆధార్, రేషన్ కార్డుల జెరాక్స్‌లు అందజేసి ఈ పథకం కింద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జోన్-2 కమిషనర్ శైలజ వల్లి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గొడవలో ఒకరికి గాయాలు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇరుగుపొరుగు వారు గొడవ పడటంతో ఓ వ్యక్తికి గాయాలైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురం జీఎస్ఎస్‌యూఆర్ఎం కాలనీలో నివసిస్తున్న జి.దుర్గారావుకు ఇరుగుపొరుగున నివసించే వారికి గొడవ జరిగింది. మాటా మాటా పెరగడంతో దాడి చేసుకున్నారు. ఈ క్రమంలో దుర్గారావుకు గాయాలయ్యాయి. వెంటనే అతడిని కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. అతడి భార్య జి.ప్రమీల గురువారం రాత్రి ఫిర్యాదు చేయడంతో సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఎస్ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ లక్ష్మీ పార్వతి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు, డాక్టర్ ఎం.తేజోమయి సంయుక్తంగా సంకలనం చేసిన ×ప్రాథమిక పాఠశాలల్లో ఐసీటీ ఆధారితంగా మల్టీ మీడియా వినియోగించి జీవశాస్త్ర అంశాల బోధన₹ పుస్తకాన్ని రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ లక్ష్మీపార్వతి, ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీపార్వతి మాట్లాడుతూ ఆచార్యులు పరిశోధన ఫలితాలను పుస్తక రూపంలో తీసుకురావడంతో ఎందరికో మేలు కలుగుతోందన్నారు. పుస్తక రచయిత డాక్టర్ టి.షారోన్‌రాజుని అభినందించారు. పుస్తక రచయిత ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ పరిశోధన సిద్ధాంత గ్రంథాన్ని జనబాహుళ్యంలోకి తీసుకువస్తూ అందరికీ ఉపయుక్తంగా నిలిచే పుస్తకంగా మలిచామన్నారు. తన పరిశోధకురాలు ఎం.తేజోమయి సిద్ధాంత గ్రంథాన్ని పుస్తకంగా తీర్చిదిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

'ఎంఎస్ఎంఈ సర్వే' బ్యానర్ ఆవిష్కరణ



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: ఎంఎస్ఎంఈ సర్వే అండ్ సపోర్ట్ కార్యక్రమ బ్యానర్‌ను శుక్రవారం జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వే కోసం మొబైల్ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ల ద్వారా ఈ సర్వే పురోగతిని జిల్లా పరిశ్రమల కేంద్రం కలెక్టర్ ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తుందని జేసీ వివరించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సిహెచ్.గణపతి, డీఎల్‌డీవో ఆర్.పూర్ణిమాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏఎంసీలో కడావర్ ట్యాంక్ ప్రారంభం



కడావర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీ అనాటమీ విభాగంలో నూతనంగా నిర్మించిన కెడావర్ ట్యాంక్‌ను శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ ట్యాంక్ నిర్మాణానికి ఏఎంసీ 1987 బ్యాచ్ విద్యార్థి డాక్టర్ కె.ధనుంజయనాయుడు రూ.60 వేల విరాళంగా ప్రకటించారు. అనాటమీ సహాయ ఆచార్యులు డాక్టర్ హేమరాధిక ప్రత్యేక పర్యవేక్షణలో అనాటమీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రవీంద్ర కిషోర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సావిత్రిభాయి పూలే ట్రస్టు, జ్యోతీబసు దేహదాన ప్రోత్సాహక సంస్థల ద్వారా అందజేయనున్న కడావర్ల(మృతదేహాలు)ను భద్రపరచడానికి, నిల్వ చేయడానికి ఈ ట్యాంక్ ఉపయోగపడుతుందని ప్రిన్సిపాల్ బుచ్చిరాజు తెలిపారు. మృతదేహాలను నిల్వ చేయడం ద్వారా వైద్య విద్యార్థులకు శరీర నిర్మాణ శాస్త్రాన్ని మరింత మెరుగ్గా బోధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అనాటమీ విభాగ ఆచార్యులు డాక్టర్ డి.రాధిక, సహాయ ఆచార్యులు డాక్టర్ బంగారయ్య, డాక్టర్ సురేఖ, డాక్టర్ విశ్వశాంతి, డాక్టర్ సునీత, డాక్టర్ నీరజ, డాక్టర్ సునీత, డాక్టర్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

బుల్లయ్య కాలేజీ విద్యార్థుల సైకిల్ రైడ్

సీతంపేట: లంకపల్లి బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవాల్లో భాగంగా శుక్రవారం కాలేజీ విద్యార్థులు సైకిల్స్‌పై ప్రయాణించి ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించారు. కళాశాల నుంచి ప్రారంభమైన సైక్లింగ్ రైడ్ జగదాంబ, కలెక్టర్ ఆఫీస్, బీచ్ రోడ్, వీఎంఆర్‌డీఏ పార్క్, ఏయూ, సీఎంఆర్ జంక్షన్ వరకు సుమారు 8.5 కిలో మీటర మేర నిర్వహించారు. ఈ రైడ్‌ను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.మధుకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నిత్యం శారీరక వ్యాయామాలు చేయడం, సైకిల్ తొక్కడం ద్వారా ఫిట్‌నెస్ స్థాయిలను మెరుగుపర్చుకోవాలని సూచించారు.